RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 09 | డిసెంబర్ 10, 2025 | వెల : రూ.3-00



తెలంగాణ ఇచ్చిన దేవత సోనియమ్మ

4లో..

# బహు'జన' సంకల్పం..



- ☐ గణపురంలో అధికార పార్టీ అభ్యర్థికి చెక్!
- ☐ లోలోపల మథనం.. బీసీ లీడర్లు ఏకం..?
- ☐ అక్కడ ఓట్లు 'కత్తెర' పెట్టి..మరో చోట చేరేలా నిర్ణయం!
- ☐ గౌడ సంఘ నేతల అంతర్గత సమావేశంలో డెసిషన్?
- ☐ స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి వైపు జనం మొగ్గు..!
- ☐ పొలిటికల్ హీట్‌కు తెర పడేది మరికొన్ని గంటల్లో..

**వేద న్యూస్, ఫోకస్ టీమ్:**

సర్పంచ్ ఎన్నికల ప్రచారం చరమాంకానికి చేరింది. ఈ క్రమంలో గ్రామాల్లో రాజకీయ వాతావరణం బాగా వేడిక్కింది. అయితే, ఈ ఎన్నికలు లోకల్‌లో ఉండే లీడర్లకు అత్యంత ప్రతిష్టాత్మకం కావడంతో ఓ వైపు అధికార పార్టీ అండ, మరోవైపు సొంత ప్రజా ఇమేజ్ ఉన్న నేతలు హోరాహోరీగా పోటీ పడుతున్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే జీఎస్ఆర్(గండ్ర సత్యనారాయణరావు)పై ఆధారపడి ఉన్న గణపురం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఓ వైపు, వారి వెంట పేరు మోసిన నేతలు పది మంది ఉంటే.., మరోవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాల ప్రజలు బలపర్చిన ప్రజానేత మరోవైపు బరిలో నిలిచారు. అధికార పార్టీ నుంచి ఎమ్మెల్యే ఇమేజ్‌తో పోటీలో నెగ్గితే ఆ సర్పంచ్‌కు సుమారు పదిమంది నేతలు అప్రకటిత సర్పంచ్‌లు అయ్యే అవకాశం ఉందని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ సంగతి అలా పక్కనపెడితే...అధికార పార్టీలో ఉన్నా, స్థానిక ఎమ్మెల్యే బరిలో నిలవద్దని చెప్పినా, ప్రజా అభిప్రాయం మేరకు ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నేతలు బలపరిచిన నేతకు ప్రజల, బీసీ కులస్తులు 'కత్తెర' గుర్తుకు సంపూర్ణంగా మద్దతు ఉందనే చర్చలు బలంగా వినవస్తున్నాయి. సొంత నిర్ణయం తీసుకునే వ్యక్తిని సర్పంచ్‌గా ఎన్నుకుందాం అని స్థానిక ప్రజలు ఫిక్స్ అయినట్లు తెలుస్తున్నది. ఒక ఓటుతో ఒకే నేత"ఒక్క ఓటు పదిమంది సర్పంచులు.." కాకుండా, "ఒక్క ఓటు తో ఒకే నేత' అనే నినాదం ప్రజల్లో బలంగా చొచ్చుకుపోయింది. ప్రజల ఆదరాభిమానాలు కలిగిన నేత వైపే ప్రజలు ముగ్గు చూపుతున్నారనే కక్షతో కొందరు అధికార పార్టీ నేతలు వారిని కట్టడి చేసినందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలతో ప్రచారం ముగియనున్న నేపథ్యంలో ప్రచారం ముగిసిన తర్వాత ఎవరి ఇళ్లకు వారిని పంపాల్సి ఉండగా, 5 గంటల వరకు వారికి చెల్లించాల్సిన రొక్కం చెల్లించకుండా.. ఓ అధికార పార్టీ నేత మహిళలను కట్టడి చేశారని, మరో ప్రచారానికి వెళ్లకుండా అడ్డకున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. అధికార పార్టీ నాయకులంతా అధికార పార్టీ బలపరిచిన నేతకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. కానీ, అంతర్గతంగా సపోర్ట్ చేసేది స్వతంత్ర అభ్యర్థి, ప్రజా నేత లావణ్య శివశంకర్ గౌడ్ అని తెలుస్తున్నది. అధికార పార్టీ బ్యాట్ గుర్తును కాదని, స్వతంత్రంగా నిలబడ్డ బీసీ నేత 'కత్తెర' గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కొందరు ప్రచారం చేయడం ద్వారా వారి మనసులో ఉన్న మాటను బయటకు వచ్చిందని కొందరు పేర్కొంటున్నారు. స్వయంగా ఇందుకు సంబంధించిన వీడియోను వారుతీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, అది ప్రస్తుతం గణపురం మండల కేంద్రంలో వైరల్ గా మారింది. దీంతో అధికార పార్టీ నేతతో సహా వారికి సపోర్ట్ చేసే మరో పది మంది కీలక నేతలు తలలు పట్టుకుంటున్నారని విశ్వసనీయ సమాచారం. సేవకుడికే మద్దతుగణపురం మేజర్ గ్రామ పంచాయితీలో పొద్దస్తమానం అధికార పార్టీ నేతలకు తలొగ్గి ప్రచారం చేసిన నేతలు వారి మనస్సాక్షిని మాత్రం ప్రజాసేవకుడికి మద్దతు పలికేలా ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలుస్తున్నది. ఇందుకు కారణం కేవలం మండల కేంద్రం హెడ్ క్వార్టర్‌లో 2 శాతం ఉన్న ఓసి నేతలకు, 90 శాతం పైగా ఉన్న బహుజనులు సపోర్ట్ చేయడం ఏంటని వారిలో వారు మధనపడుతున్నట్లు తెలుస్తున్నది. అందుకే తమకు ఎల్లవేళలా వెన్నంటి ఉండే నేత, తమ ఇంటి బీసీ ఆడ బిడ్డ మోటపోతుల లావణ్య శంకర్ గౌడ్‌కి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామని అంతర్గతంగా చర్చించుకున్నట్లు సమాచారం. అధికార పార్టీ నేతలు,అటు అధికార పార్టీ రెబల్ అభ్యర్థి లావణ్య శివ శంకర్ గౌడ్ బరిలో ఉండటంతో పొలిటికల్ వాతావరణం బాగా హీటెక్కింది. కాకతీయుల కాలం నుండి గణపురం పాలన అధిష్టిం చడంలో కీలకపాత్ర వహించిన గౌడ కులస్తులు గణపురం పట్టణ లో మెజార్టీ శాతం ఉన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న వారసులు మెజార్టీ శాతంగా ఉన్న గౌడ కులస్తులు.. తమ కుల బాంధవు డిని అధికార పార్టీ కాదనడంపై గుర్రుగా ఉన్నట్లు సమాచారం. బహుజనుల సంకల్పం ఏ విధంగా ఉండనుందనేది అతి త్వరలో చూపించేందుకు వారు సిద్ధమై బలమైన నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది.



## తెలంగాణలో సినీ పరిశ్రమకు కొత్త జోష్

3లో..

## మార్చి 14నుంచి పదో తరగతి పరీక్షలు



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్ మంగళవారం విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 తేదీ వరకు పరీక్షలు జరగనున్నట్లు బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ తెలిపింది. ఈ మేరకు ఎస్ఎస్‌సీ ఒక ప్రకటన విడుదల చేసింది. మార్చి 14వ తేదీన పరీక్షలు ప్రారంభమవుతాయని స్పష్టం చేసింది.

**పదో తరగతి పరీక్షల షెడ్యూల్**

**మార్చి 14న మొదటి భాషా పరీక్ష,**
**మార్చి 18న సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష,**
**మార్చి 23 థర్డ్ లాంగ్వేజ్,**
**మార్చి 28 మ్యాథమాటిక్స్,**
**ఏప్రిల్ 2 సైన్సు పార్ట్-1 ఫిజిక్స్,**
**ఏప్రిల్ 7 బయలాజికల్ సైన్స్,**
**ఏప్రిల్ 13 సోషల్ స్టడీస్,**
**ఏప్రిల్ 15 ఒకేషనల్ కోర్సు పేపర్-1 భాషా పరీక్ష,**
**ఏప్రిల్ 16 ఒకేషనల్ కోర్సు పేపర్-2 భాషా పరీక్ష,**

ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు

పదో తరగతి పరీక్షలు ఉదయం 9:30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహిస్తారు. సైన్స్ సబ్జెక్టుల్లో (ఫిజిక్స్, బయాలజీ) సంబంధించి పరీక్ష విధానంలో ప్రకటనలో స్పష్టత ఇచ్చారు. ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలు రెండు భాగాలుగా వేర్వేరు రోజుల్లో వారం రోజుల వ్యవధితో జరగనున్నాయి. ముఖ్యంగా బయాలజీ, సోషల్ స్టడీస్ పరీక్షలకు మధ్య ఎక్కువగా 5 రోజుల గ్యాప్ ఉంది. పరీక్షలకు ఇంకా సరిగ్గా 3 నెలల సమయం ఉంది.

## సురేఖక్క ఇందిరమ్మ చీర అదుర్స్

– గ్లోబల్ సమ్మిట్ లో లోకల్ అట్రాక్షన్ గా మంత్రి కొండా సురేఖ



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ లోకల్ అట్రాక్షన్ గా నిలిచారు. గ్లోబల్ సమ్మిట్‌లోకి మంత్రి సురేఖ ఇందిరమ్మ చీరలో అడుగు పెట్టిన క్షణం మొదలు అందరూ ఆత్మీయంగా ఆమెను పలకరించారు. తొలుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి, జూపల్లి కృష్ణారావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రివర్గ సహచరులుతో తెలంగాణ తల్లి విగ్రహం లాంఛ్ చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెను కలిసిన ప్రతి ఒక్కరూ సురేఖక్క ఇందిరమ్మ చీర బాగుంది అంటూ కితాబిచ్చారు. మంత్రి సురేఖ దేవాదాయ, అటవీ, పర్యావరణ విభాగానికి సంబంధించిన ప్యానెల్ డిస్కషన్ లో పాల్గొన్నారు. సమ్మిట్ తర్వాత వివిధ స్టాల్స్ ను పరిశీలిస్తున్న సందర్భంలో మంత్రి సురేఖతో అందరూ సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి చూపించారు. సురేఖమ్మ... ఇందిరమ్మ చీర అదుర్స్ అంటూ చెప్పుకొచ్చారు.

## ఇండిగోపై కేంద్రం కఠిన నిర్ణయం..!

– పదిశాతం విమానాలను తగ్గించాలని ఆదేశాలు




**వేద న్యూస్, డెస్క్:**

దేశవ్యాప్తంగా ఇండిగో ఎయిర్‌లైన్స్ సేవల్లో చోటుచేసుకున్న గందరగోళం, వేలాది ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పౌర విమానయాన మంత్రిత్వశాఖ కఠిన చర్యలు చేపట్టింది. ప్రస్తుతం నడుపుతున్న విమానాల్లో పదిశాతం తగ్గించాలని ఇండిగోకు మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇటీవలి రోజుల్లో క్రూ రోస్టర్ సమస్యలు, ఆపరేషన్లలో మిస్ మేనేజ్ మెంట్, విమానాల షెడ్యూలింగ్‌లో అవ్యవస్థ, కమ్యూనికేషన్ లోపాలు కారణంగా ఇండిగో సేవలు దెబ్బతిన్నాయి. దీని ప్రభావం ప్రయాణికులపై తీవ్రంగా పడటం, వరుస విమాన రద్దులు జరగడంతో కేంద్రం జోక్యం చేసుకొని కంపెనీపై క్రమశిక్షణాత్మక చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్‌ను మంగళవారం మంత్రిత్వశాఖ కార్యాలయానికి పిలిపించారు. సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కంపెనీ చేపట్టిన చర్యలను ఆయన వివరించారు. ప్రభావిత విమానాలకు సంబంధించిన వందశాతం రీఫండ్లు డిసెంబర్ 6 నాటికే ప్రాసెస్ చేసినట్లుగా ఆయన తెలిపారు. ప్రయాణికుల సామాను త్వరితగతిన తిరిగి అందించాలని, మిగిలిన రీఫండ్లను ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని మంత్రిత్వశాఖ కఠినంగా

మిగతా 3వ పేజీలో..

వేద న్యూస్

బుధవారం డిసెంబర్ 10, 2025

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే నాగరాజు

**వేద న్యూస్, హనుమకొండ :**



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 43వ డివిజన్ పరిధిలోని లక్ష్మిపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాబా భాయ్ సోదరుడు ఏ ఆర్ కానిస్టేబుల్ సాజిద్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాగరాజు వారి నివాసానికి వెళ్లి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అదే గ్రామానికి చెందిన సోమిశెట్టి శ్రీనివాస్ అనారోగ్యంతో మరణించగా వారి నివాసానికి వెళ్లి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు,వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఇచ్చిన దేవత సోనియా గాంధీ

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



– మీర్జా అత్తర్

తెలంగాణ ఇచ్చిన దేవత సోనియా గాంధీ అని 40 వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మీర్జా అత్తర్ అన్నారు. డివిజన్ లోని డీకే నగర్ లో హస్సన్, లక్ష్మీనారాయణ, దుర్గమ్మ ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీర్జా అత్తర్ పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చింది సోనియా గాంధీనేనని అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల కుమారస్వామి, తోట సతీష్, లక్ష్మి కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్వాడి సెంటర్లకు నేల చిరు చాపల పంపిణీ

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ రామన్నపేటలోని డాక్టర్. ఏ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం సెంటర్ నెంబర్ 2114074, 2114161 గల అంగన్వాడి టీచర్లైన సుభాషిని, జ్యోత్స్న లకు సెంటర్ కి ఒకటి చొప్పున రెండు చిరు చాపలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గతంలో కొన్ని అంగన్వాడీ కేంద్రంలో సీలింగ్ ఫ్యాన్, పిల్లలకు పలకలు బలపాలు, కొన్ని మహనీయుల జయంతిల సందర్భంగా పండ్లు బిస్కెట్లు పంపిణీ చేయడం జరిగినదన్నారు. అలాగే కొన్ని సెంటర్లలో దంత మరియు జనరల్ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తూ ఉచితంగా మందులు పంపించేశారని తెలిపారు. ఈ సెంటర్లో టీచర్లు తమ దృష్టికి తీసుకొని రాగా అలాగే చిన్నపిల్లలు చలికాలంలో బండలపై చల్లగా ఉంటుంది అని ఉద్దేశంతో చాపలు పంపిణీ చేయడం జరిగినదన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్లు సంతోషం వ్యక్తపరిచారు. అలాగే అతిథిగా విచ్చేసిన జక్కుల విజయకుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గ



నైజర్ శ్రవణ్, మెంబర్స్ రామ శ్రీనివాస్, శైలజ అంగన్వాడి సెంటర్ ఆయాలు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఓటర్లకు కొత్త ట్రెండ్‌తో అభ్యర్థుల గాలం..!

**వేద న్యూస్, శంకరపట్నం:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులు కొత్త ట్రెండ్‌ను ఉపయోగిస్తున్నారు. తాము ఎన్నికల్లో గెలిస్తే ఊరిని అద్భుతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇస్తూ, ఊరంతా తమకే మద్దతు తెలిపేలా ఏఐ జనరేటెడ్ ట్రెండ్ వీడియోలు, ఆడియోలు వాడుతున్నారు. ఎన్నికలలో ప్రత్యర్థులు వంచించినట్లు, పలువురు తమకు మద్దతు తెలిపినట్లు ఏఐతో వీడియోలు, ఫొటోస్ సృష్టిస్తున్నారు. ఈ మేరకు వాట్సాప్ గ్రూప్‌లలో లింకులు పంపి ఓటర్లను ప్రసన్నం చేసు కోవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు నిజమైన ప్రేమ, అభిమానంతో గ్రామ ప్రజలు నాయకులను ఎన్నుకొని గ్రామ అభివృద్ధి లో పాలు పంచుకునేవారు. కానీ ప్రస్తుత పరిస్థితులు భిన్నంగా మారి టెక్నాలజీ ట్రెండ్ ను వాడుతూ, కొత్త కొత్త పద్ధతులలో వినూత్నంగా ప్రచా రాలకు తెరలేపుతూ, ఓటర్లను తమ వైపు తిప్పుకోవడానికి నానా పాట్లు పడుతున్నారు. ఏఐ ను విరివిరిగా వాడుతూ, ట్రెండు ఫాలో అవ్వడం కాదు ట్రెండ్ సెట్ చేస్తున్నారు.



# భారీగా మద్యం రవాణా యత్నం భగ్నం

**– 167 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం,కారు సీజ్..ఒకరిపై కేసు నమోదు**

**వేద న్యూస్, ముస్తాబాద్:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం మద్దికుంట గ్రామానికి తరలిస్తున్న భారీ మొత్తంలో అక్రమ మద్యాన్ని ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. మోహినికుంట గ్రామానికి చెందిన పల్లెటి కుమార్ అనే వ్యక్తి అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా పోలీసులు తనిఖీలలో పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 167 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం పరిమాణం 30.6 లీటర్లుగా ఉందని అధికారులు వెల్లడించారు. అధికారులు అక్రమ మద్యం రవాణాకు ఉపయోగించిన కారును కూడా సీజ్ చేశారు. అక్రమ విక్రయాలు మరియు రవాణా చట్టరీత్యా నేరం కావడంతో, నిందితుడు పల్లెటి కుమార్‌పై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అక్రమంగా మద్యం అమ్మకాలు, నిల్వ మరియు రవాణా చేయడం శిక్షార్హమైన నేరం. ఇలాంటి చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం కేసులు నమోదు చేస్తాం అని ఎస్సై గణేష్ హెచ్చరించారు



.ప్రజలు కూడా ఇటువంటి అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే తెలియజేయాలని ఎస్సై ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# చెక్ పోస్ట్ ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

**వేద న్యూస్,రుద్రంగి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని మానాల క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆకస్మిక తనిఖీ చేశారు. చెక్ పోస్టు నందు అధికారులు,సిబ్బంది నిర్వహిస్తున్న వాహన తనిఖీలను పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్ పోస్టు వద్ద పనిచేసే అధికారులు మరియు సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలను నమోదు చేసుకో వాలని సూచించారు. పోలింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉంటూ ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా జరిగే నగదు,మద్యం వంటి అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ మొత్తం సజావుగా జరిగేలా అధికారులు భాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. జిల్లా ప్రజలందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియో గించుకునేలా పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఈకార్యక్రమంలో చందుర్తి సి.ఐ వెంకటేశ్వర్లు,ఎస్.ఐ శ్రీనివాస్ ,సిబ్బంది ఉన్నారు.

# ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం..!

**వేద న్యూస్, రుద్రూర్ :**



బోధన్ డిపోకు చెందిన టిఎస్ 16 యుసి 3223 ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు వెనుక బాగాన ఉన్న అద్దాన్ని రుద్రూర్ మండల కేంద్రంలోని జేయన్సీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి రాయితో పగులగొట్టాడని ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ తెలిపారు. బాన్సువాడ నుండి బోధన్ వైపుకు వెళుతున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు అక్బర్ నగర్ గ్రామం వద్ద చిన్నపాటి జరిగిన గొడవ కారణంగా, రుద్రూర్ గ్రామంలోని జేయన్సీ కాలనీ వద్ద కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సు వెనుక భాగన అద్దాన్ని రాయితో పగలగొట్టడంతో, వెనుక సిటులో కూర్చున్న వ్యక్తికి తీవ్ర గాయం అయిందని ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో, ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

**– ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**

**– తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, ఎస్ హెచ్ ఓ లతో వీడియో కాన్ఫరెన్స్**

**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**

గ్రామ పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11 వ తేదీన మొదటి ఫేజ్ ఎన్నికలు పోలింగ్, కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చూడాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, ఎస్ హెచ్ ఓ లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి మంగళవారం ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా ఎన్నికల వ్యయ, సాధారణ పరిశీలకులు రాజ్ కుమార్, రవి కుమార్, నోడల్ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 11 న మొదటి విడత ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో మద్యం అమ్మకాలు నిషేధం ఉంటుందని వివరించారు. గ్రామంలో ఓటు లేని వ్యక్తి ఆ గ్రామంలో ఉండకుండా చూడాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపల పీఓకు తప్ప ఎవరికీ మొబైల్ ఫోన్లు అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల లోపల ప్రచారం కోసం కౌంటర్లు ఏర్పాటు చేయడానికి అనుమతి లేదని తెలిపారు. మూడు విడతల్లో ఎన్నికలు పూర్తయ్యేవరకు ఎన్నికల కోడ్ ఉంటుందని, అందరూ గమనించాలని స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఎన్నికల సామాగ్రి పంపిణీపై సూచనలు చేశారు. అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన వాహనంలోనే సామగ్రితో పోలింగ్ కేంద్రానికి వెళ్లాలని స్పష్టం చేశారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం, ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని



ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. మండలాలకు కేటాయించిన పోలింగ్ సిబ్బంది అందరూ విధులకు హాజరయ్యేలా ఆయా ఎంపీడీఓ లు పర్యవేక్షించాలని, ప్రతీ ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వర్తించాలని, నివేదికలు ఎప్పటికప్పుడు అందించాలని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ శాతం ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని, పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ .ఎన్నికల నిర్వహణకు సంబంధించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. శాంతిభద్రతలు విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే అధికారులు వెంటనే తెలియజేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, నోడల్ అధికారులు శేషాద్రి, లక్ష్మీరాజం, డీపీఓ షరీఫుద్దిన్, నవీన్, భారతి తదితరులు పాల్గొన్నారు.

# వేడెక్కిన రాజకీయం

**వేద న్యూస్, శాయంపేట:**

ఈనెల 17న జరిగే మూడో విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారంతో ముగిసింది. ఉప సంహరణ గడువు ముగియడంతో అధికారులు పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలతో తుది జాబితా సిద్ధం చేశారు. మూడో విడత లో ఎన్నికలు జరుగుతున్న శాయంపేట మండలం 24 గ్రామపంచాయతీలకు ఒకటి ఏకగ్రీవం కావడంతో మిగిలిన 23 పంచాయతీలకు 86 మంది అభ్యర్థులు సర్పంచ్ గాను, 212 వార్డుల్లో 50 వార్డులు ఏకగ్రీవం కావడంతో మిగిలిన 162 వార్డుల గాను 455 మంది అభ్యర్థులు వార్డు సభ్యులుగా పోటీలో ఉన్నారు .పోటీలో ఉన్నవారికి అధికారులు గుర్తులు సైతం కేటాయించడంతో ఇప్పటికే పల్లెల్లో వేడెక్కిన రాజకీయంతోడు ప్రచారహోరు మొదలు కానుంది.

# గ్రామ అభివృద్ధికి సహకారం అందజేస్తాం

**వేద న్యూస్, గంగాధర :**

గంగాధర గ్రామ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందజేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీ ఇచ్చారు. మంగళవారం గంగాధరలో సర్పంచు అభ్యర్థి పడాల భాగ్యలక్ష్మి రాజన్న కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో పెండింగ్లో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి సహకారం అందజేస్తామన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తామన్నారు. సర్పంచ్, ఎంపీటీసీగా, ఎంపీటీసీగా రెండుసార్లు ఓడిపోయిన పడాల భాగ్యలక్ష్మి రాజన్నకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. అధికార పార్టీతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



– ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

# మిల్లు అవకతవకలపై విచారణ జరపాలి..!

**– సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్**



**వేద న్యూస్, కరీంనగర్:**

రైతుల నుంచి ధాన్యం సేకరణ విషయంలో జమ్మికుంటలోని సప్తగిరి మిల్లులో చేస్తున్న నిలువు దోపిడీ, అవకతవకలపై ఉన్నతస్థాయిలో విచారణ జరపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జమ్మికుంట పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పంజాల శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్లలో భాగంగా రైతుల ద్వారా ఐకెపి కేంద్రాల నుంచి సేకరించిన వడ్లను అలాట్ మెంట్ చేసిన జమ్మికుంట సప్తగిరి ఇండస్ట్రీస్ మిల్లులో దోపిడీకి పాల్పడుతూ సదరు మిల్లు వ్యాపారి లబ్ధిపొందుతున్నాడని ఆరోపించారు. వారికి కేటాయించిన ఐకెపి ద్వారా రైతుల నుంచి సేకరించిన ధాన్యంలో తేమ, తాలు, తప్ప వంటి లోటు పాట్లను ఆసరాగా చేసుకుంటూ రైతులను తీవ్రంగా దోపిడీ చేశారని పేర్కొన్నారు. సదరు సప్తగిరి ఇండస్ట్రీస్ మిల్లులో ఐకెపి కేటాయించిన ధాన్యానికి, మిల్లు ద్వారా చూపించిన ట్రక్ షీట్ లో భారీగా వ్యత్యాసం చూపిస్తూ రైతులను నిలువు దోపిడీ చేశారని తెలిపారు. ఒక్కో రైతుల నుంచి 10,20, 30 ఇలా క్వింటాళ్ల కొద్ది వ్యత్యాసం చూపించి సదరు మిల్లు వ్యాపారి భారీ దోపిడీకి పాల్పడ్డారని పేర్కొన్నారు. అటు ఐకెపి కేంద్రాల నిర్వాహకులను, ఇటు అధికారుల కనుసన్నల్లోనే దోపిడీ జరిగిందని బలమైన అనుమానం కలుగుతోందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, పెట్టుబడుల భారంతో చెమటోడ్చి పండించిన పంటను అమ్ముకుందామన్నా రైతులకు కష్టాలు తప్పడం లేదన్నారు. ఐకేపి కేంద్రాల్లో వడ్లు ఆరబోసి తేమ శాతం వచ్చిన తర్వాత జరిగిన కొనుగోళ్ల అనంతరం మిల్లులకు చేరవేసేదాక రైతులకు తిప్పలు తప్పడం లేదన్నారు. రోజుల తరబడి ఆరబోసి వానదేవుడిని ప్రార్థించుకున్న పంట విక్రయించుకున్న తర్వాత రైతుకు కనీస మద్దతు ధర దక్కడం గగనంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ మిల్లుల వ్యాపారులు ప్రభుత్వాన్ని, అధికారులను శాసించే విధంగా వ్యవహ రించినా చర్యలు లేకపోవడం దురదృ ష్టకరమన్నారు. సదరు సప్తగిరి మిల్లు గతంలో వడ్లను మరాడించి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని సకాలంలో ఇవ్వకున్నా చర్యలు కానరాలేదనికోట్లాది రూపాయలలో బ్యాంకు గ్యారంటీలు చెల్లిస్తూ రైతులను నిలువు దోపిడీ దందా కొనసాగిస్తున్నారని అన్నారు. అందుకు కొంత మంది అధికారులు సైతం మద్దతిస్తున్నారని ఆరోపించారు. సదరు సప్తగిరి ఇండస్ట్రీస్ రైస్ మిల్లు వ్యాపారి ధాన్యం కేటాయింపుల విషయంలో అధికారులకు సరైన పూచీకత్తులు ఇవ్వకున్నా దందా యధేచ్ఛగా సాగించాడని, వందలాది మంది రైతుల వద్ద నుంచి పెద్ద మొత్తంలో జరిగిన ఈ దోపిడీని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పంజాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జమ్మి కుంట మండల కార్యదర్శి గజ్జి ఐలయ్య, వీణవంక మండల కార్యదర్శి రాంగోపాల్, సమ్మయ్య పాల్గొన్నారు.

# సోనియమ్మ చొరవతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు

**– కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి**

**– మండల కేంద్రంలో సోనియమ్మ జన్మదిన వేడుకలు**

**వేద న్యూస్, శాయంపేట:**

దేశ ప్రధాని పీఠం అధిరోహించే అవకాశం ఉన్నప్పటికీ పదవిని తృణప్రాయంగా వదులుకున్న మహా నాయకురాలు సోనియా గాంధీ అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం సోనియమ్మ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేకు కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సోనియమ్మ సహకారంతో యూపీఏ హయంలో తీసుకువచ్చిన ఉపాధి హామీ చట్టము, సమాచార హక్కు చట్టం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు దశాబ్దాల చరిత్ర ఉన్న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమానికి ముగింపు పలుకుతూ సోనియమ్మ చొరవతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మారేపల్లి రవీందర్ ,చిందం రవి , బాసనీ శాంత, రాజు, రవిపాల్ ,కట్టయ్య, రాజేందర్ ,శంకర్ చారి, పలుపదాసు రాము తదితరులు పాల్గొన్నారు.



# ఇండిగోపై కేంద్రం కఠిన నిర్ణయం..!

ఆదేశించింది. డీజీసీఏ ఇప్పటికే షెడ్యూల్‌లోని విమానాలపై 5 శాతం కోత విధించి, ఇండిగోకు సమాచారం ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మంత్రిత్వశాఖ అదనంగా మరో 10 శాతం కోత విధించడం తో మొత్తం తగ్గింపు గణనీయంగా మారింది. రోజువారీ 2200కి పైగా విమానాలు నడుపుతున్న ఇండిగో, కోతతో సుమారు 216 విమానాలను తాత్కాలికంగా రద్దు చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ తగ్గింపు ఉన్నప్పటికీ ఇండిగో అన్ని గమ్యస్థానాలకు సర్వీసులు కొనసాగిస్తుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. విమానయాన రంగంలో శాసన, నియంత్రణ మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయడం వల్లే సేవల స్థిరీకరణ సాధ్యమవుతుందని కేంద్రం భావిస్తోంది.

# తెలంగాణలో సినీ పరిశ్రమకు కొత్త జోష్

**– ఫ్యూచర్ సిటీలో స్టూడియోలు, పూర్తి సహకారం – సీఎం రేవంత్**

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం పూర్తిగా సిద్ధమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీలో స్టూడియోలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2025 రెండో రోజు “సృజనాత్మక శతాబ్దం వినోద రంగం భవిష్యత్తు” అంశంపై జరిగిన చర్చల్లో పాల్గొన్న సినీ ప్రముఖులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రంరెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజూ హాజరయ్యారు. సినీ పరిశ్రమ నుండి చిరంజీవి, రితేష్ దేశ్‌ముఖ్, సుభాష్ ఘాయ్, అల్లు అరవింద్, సురేష్ బాబు, జెనీలియా దేశ్‌ముఖ్, అక్కినేని అమల, జోయా అక్తర్, చంకీ పాండే, శ్యాం ప్రసాద్ రెడ్డి, అనిరుధ్ రాయ్ చౌదరి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. పరిశ్రమ అభివృద్ధిపై తమ అభిప్రాయాలను వారు ముఖ్యమంత్రికి తెలియజేశారు. పరిశ్రమ అవసరాలను అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. “స్క్రిప్ట్‌తో వస్తే సినిమా పూర్తి చేసుకుని వెళ్లేలా ప్రభుత్వం వాతావరణం సృష్టిస్తుంది. సినీ రంగ అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తుంది” అని సీఎం వెల్లడించారు. అలాగే ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో సినిమా పరిశ్రమకు చెందిన 24 క్రాఫ్ట్‌లో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించే అవకాశాలను పరిశీలించాలని ఆయన సూచించారు. ఈ సమావేశం సినీ పరిశ్రమ ప్రభుత్వం మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసినదిగా భావిస్తున్నారు.



# సహాయం పేరుతో విద్యార్థినిపై అఘాయిత్యం

**వేద న్యూస్ డెస్క్ :** తిరుపతి నగరంలో మరోసారి మానవత్వాన్ని మరిచిపోయే ఘటన వెలుగులోకి వచ్చింది. పాలిటెక్నిక్‌లో చదువుతున్న మైనర్ విద్యార్థినికి సహాయం చేస్తానని నమ్మబలికిన ర్యాపిడో ఆటో డ్రైవర్ సాయికుమార్ దారుణంగా అత్యాచారం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పరిచయం పేరిట విద్యార్థినిపై నమ్మకం పెంచుకుని, చివరకు ఆ నమ్మకాన్ని దుర్వినియోగం చేసిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. వివరాల్లోకి వెళితేఎస్వీ పాలిటెక్నిక్‌లో చదువుతున్న బాధితురాలు ప్రైవేట్ హాస్టల్‌ను మార్చుకునే సందర్భంలో ర్యాపిడో ఆటో బుక్ చేసింది. ఆ ప్రయాణంలోనే డ్రైవర్ సాయికుమార్ ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. విద్యార్థిని ఫోన్ నంబర్ తీసుకున్న నిందితుడు తరచూ మాట్లాడి, అవసరమైతే డబ్బు సహాయం చేస్తానంటూ నమ్మబలికాడు. కొన్ని రోజుల తరువాత విద్యార్థినికి నిజంగానే డబ్బు అవసరం ఏర్పడటంతో అతడిని సంప్రదించింది. అవకాశమొచ్చిందని భావించిన సాయికుమార్, సహాయం అందిస్తానంటూ ఆమెను తన గదికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించడంతో విద్యార్థిని తీవ్ర భయానికి గురైంది. కానీ, భయంతో కుంగిపోయిన విద్యార్థిని తన స్నేహితురాలికి విషయం చెప్పడంతో, ఆమె ధైర్యం చెప్పి పోలీసులను ఆశ్రయించమని సూచించింది. చివరకు అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిజం వెలుగులోకి వచ్చింది. మినర్ బాధితురాలు కావడంతో పోలీసులు వెంటనే సాయికుమార్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు.

## మాజీ ఎమ్మెల్యే రాకతో

# వేడెక్కిన రాజకీయ వాతావరణం..!

**వేద న్యూస్, రుద్రూర్ :**




స్థానిక ఎన్నికల్లో భాగంగా రుద్రూర్ లో రాజకీయ వాతావరణం రసవత్తరంగా మారింది. అటు పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్గం.. ఇటు ఏనుగు రవీందర్ రెడ్డి వర్గం, మరో వైపు బీజేపీ పార్టీ పోటా పోటీగా మారాయి. సర్పంచ్ బరిలో ఇందూర్ సునీత– ఇందూర్ చంద్రశేఖర్ గెలుపు ఖాయమని రాజకీయ విశ్లేషకులు అనుకుంటున్నారు. ఇందూర్ చంద్రశేఖర్ గత పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ జెండా మోస్తున్నారని ప్రజలు అంటున్నారు. మంగళవారం బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, ఉర్దూ అకాడమీక్ చైర్మన్ తాహెర్ బీన్ అందన్ రాకతో రాజకీయాల్లో కొత్త మార్పులు వచ్చాయి. ఏది ఏమైనా రుద్రూర్ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి ఇందూర్ సునీత– చంద్రశేఖర్ గెలుపు ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి సర్పంచ్ అభ్యర్థి ఇందూర్ సునీత – ఇందూర్ చంద్రశేఖర్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

# ఘనంగా 56 వ రక్షణ పక్షోత్సవాలు

**వేద న్యూస్, కాసిపేట:**



కాసిపేట 1 ఇంక్లైన్‌లో 56వ రక్షణ పక్షోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ విజయ ప్రసాద్, రక్షణ కమిటీతో కలిసి కార్యక్రమానికి విచ్చేసిన ఉద్యోగులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాట్లాడిన కన్వీనర్ విజయ ప్రసాద్ మాట్లాడుతూ, “రక్షణ – ఉత్పత్తి రెండూ సమాంతరంగా నడిస్తేనే సంస్థ అభివృద్ధి సాధ్యమవుతుంది. ఉద్యోగులు ఇంటినుంచి రక్షణ పట్ల అవగాహనతో వచ్చితే ప్రమాదాలు పూర్తిగా నివారించవచ్చు. ఇంటి వద్ద మహిళలు వంటింట్లో రక్షణ పాటించడం కూడా కుటుంబ సుఖశాంతికి కారణం” అని తెలిపారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బెల్లంపల్లి సెక్రెటరీ దాగం మల్లేష్ మాట్లాడుతూ, “ఎల్లప్పుడూ రక్షణనే ప్రథమ కర్తవ్యంగా తీసుకుంటే మనం, మన కుటుంబాలు సురక్షితంగా ఉంటాయి” అని ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ రాంబాలు, ఎస్.ఓ – టు – జి.ఎం లలిత ప్రసాద్, మేనేజర్ సతీష్, రక్షణాధికారి నిఖిల్, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, గుర్తింపు సంఘం పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీనారాయణ, డిప్యూటీ జనరల్ మేనేజర్ శివశంకర్, సూపరింటెండెంట్ అఫ్ ఇంజనీర్ శైలేంద్ర కుమార్, సరేయర్ రమేష్, మహేంద్రనాథ్, పోషమల్లు, నాగేశ్వరరావు, సారయ్య, శ్రీనివాస్, కుమారస్వామి, సంక్షేమ అధికారి, పిట్ సేఫ్టీ కమిటీ సభ్యులు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు ఉద్యోగులు పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లి విగ్రహాన్ని

# ఆవిష్కరించిన అదనపు కలెక్టర్

**– హాజరైన జిల్లా అధికారులు, సిబ్బంది**

**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రోడ్స్ అండ్ బిల్డింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్ ఆవిష్కరించారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హాజరు కాగా, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పాటిస్తూ అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఈఈ నరసింహాచారి, సీపీఓ శ్రీనివాసాచారి, డోర్స్ అధ్యక్షుడు డీవీ హెచ్ ఓ రవీందర్ రెడ్డి, ఏవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మ్యాట్స్ పంపిణీ

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



**– అంగన్‌వాడీ కేంద్రాలకు..**

వరంగల్ రామన్నపేటలోని డాక్టర్. ఏ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సెంటర్ నెంబర్ 2114074, 2114161 గల అంగన్‌వాడీ కేంద్రాలకు మంగళవారం మ్యాట్స్ పంపిణీ చేశారు. అంగన్ వాడీ టీచర్లు,సుభాషిని, జ్యోత్స్నలకు సెంటర్‌కి ఒకటి చొప్పున రెండు మ్యాట్స్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గతంలో కొన్ని అంగన్వాడీ కేంద్రంలో సీలింగ్ ఫ్యాన్, పిల్లలకు పలకలు బలపాలు, కొన్ని మహనీయుల జయంతి ల సందర్భంగా పండ్లు బిస్కెట్లు పంపిణీ చేయడం జరిగినదన్నారు. అలాగే కొన్ని సెంటర్లలో దంత, జనరల్ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తూ ఉచితంగా మందులు పంపించేశారని తెలిపారు. ఈ సెంటర్లో టీచర్లు తమ దృష్టికి తీసుకొని రాగా అలాగే చిన్నపిల్లలు చలికాలంలో బండలపై చల్లగా ఉంటుంది అని ఉద్దేశంతో మ్యాట్స్ పంపిణీ చేసినట్టు తెలిపారు.. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్లు సంతోషం వ్యక్తపరిచారు. అలాగే అతిథిగా విచ్చేసిన విజయకుమార్ అభినందించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ శ్రవణ్, మెంబర్స్ రామ శ్రీనివాస్, శైలజ అంగన్వాడి సెంటర్ ఆయాలు, పుర ప్రముఖులు పాల్గొన్నారు

## బాసని శాంతను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తాం




**వేద న్యూస్,శాయంపేట:**

శాయంపేట పద్మశాలి కులము విద్యాధికురాలు మృదు స్వభావిని గ్రామంలోని అన్ని కులాలతో సత్సంబంధాలు కలిగిన బాసని శాంత ను శాయంపేట గ్రామ సర్పంచ్ గాపద్మశాలి కులము సంపూర్ణ మద్దతును తెలిపారు.అనంతరం పద్మశాలి కులస్తులంద రూ బాసని శాంత సర్పంచిగా అత్యధిక మెజారిటీతో గెలవాలని శాయంపేట గ్రామంలోని ప్రదర్శనగా శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయం కు వెళ్లి స్వామి వారి ఆశీస్సులు అందించాలని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థి బాసని శాంత ,వంగర సాంబయ్య ,దిడ్డి రమేష్,బూర లక్ష్మీనారాయణ,గౌట్టిముక్కుల రమేష్ ,మామిడి భరత్, భాషని రాజు ,వలుప దాసి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# మొదటి విడత ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

**– జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మొదటి విడత ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు.ఎన్నికల విధుల్లో భాగంగా పోలీస్ అధికారులు,సిబ్బందితో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ ఎన్నికల విధులకు సంబంధించి విధులపై దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మొదటి విడత ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు.శాంతి యుత వాతవారణంలో మొదటి విడత ఎన్నికలు నిర్వహించడానికి రూట్ మొబైల్స్ 25 , జోనల్ టీమ్స్ ఇన్స్పెక్టర్ స్థాయి అధికారితో 07,క్విక్ రియాక్షన్ టీమ్స్ 05 , స్ట్రయికింగ్ ఫోర్స్ 02 ఏర్పాటు చేసి మొత్తంగా 700 మంది పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది పోలింగ్ కేంద్రాన్ని పోలింగ్ సమయంలో,కౌంటింగ్ సమయంలో ఎట్టి పరిస్థితులలోనూ వదిలి వెళ్లవద్దని,రూట్ మొబైల్ అధికారులు తరచు తనకు కేటాయించిన రూట్లలలో పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు.పోలింగ్ కేంద్రాల వద్ద,రూట్ లలో పోలింగ్ ప్రశాంత వాతావరణానికి భంగం కలిగే ఏ చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత అధికారులకు



సమాచారం అందించాలన్నారు.ఎన్నికల విధులలో ఉన్న సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా ఉండాలని,అనవసర విషయాలు చర్చించవద్దన్నారు.ఓటర్లు ఎవ్వరూ కూడా సెల్ ఫోన్ లు,మందుగుండు సామాగ్రి,ఇంక్ బాటిల్స్, వాటర్ బాటిల్స్, పోలింగ్ బూతులోనికి తీసుకువెళ్లారాదని , సెల్ఫీలు దిగడం నిషేదం అన్నారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఎన్నికలు నియమావళి పాటిస్తూ స్వేచ్ఛాయుత వాతావరణం లో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పి కోరారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడిన, ఎన్నికల నియమావళి ప్రకారం చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈసమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ లు, ఎస్.ఐ లు,సిబ్బంది పాల్గొన్నారు.

# 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు

**వేద న్యూస్ మెదక్ జిల్లా:**




**– జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస్ రావు ఐపీఎస్**

స్థానిక సంస్థల ఎన్నికలు మొదటి విడతగా రేగోడ్, హవెలిఘణపూర్, టేక్మాల్, అల్లాదుర్గ్, పాపన్నపేట్, పెద్ద శంకరంపేట్ మండలాల్లో ఈ నెల 11న జరగనున్న నేపథ్యంలో, ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరగేందుకు ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, పోలింగ్ కేంద్రాలు సీసీ కెమెరాల నిఘా లో ఉంటాయని జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస్ రావు ఐపీఎస్ తెలిపారు. పోలింగ్‌కు 44 గంటల ముందు నుండి మంగళవారం సాయంత్రం 5 గంటల నుండి పోలింగ్ ముగిసే వరకు సైలెంట్ పీరియడ్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ సమయంలో సభలు, సమావేశాలు, ఇంటింటా ప్రచారం పూర్తిగా నిషేధమని తెలిపారు. ఎంసీసీ ఉల్లంఘనలు జరిగితే ఎన్నిక రద్దు అయ్యే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో మద్యం, డబ్బుల పంపిణీ చేసినా, గొడవలు లేదా అల్లర్లు సృష్టించినా వారిపై వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొదటి విడత ఎన్నికల నిర్వహణ కోసం మూడు అంచెల భద్రతా వ్యవస్థతో మొత్తం 750 మంది పోలీసు సిబ్బందిని నియమించి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఈ బందోబస్తు కొనసాగుతుందని అన్నారు. ఎన్నికలు ముగిసే వరకు 163 బి ఎన్ ఎస్ ఎస్ (144 సెక్షన్) అమల్లో ఉంటుందని, ముగ్గురికి మించి గుంపులుగా ఉండడం నిషేదమని తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, అసత్య సమాచారం, వదంతులు వ్యాప్తి చేసే వారి పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే విధంగా సోషల్ మీడియా దుర్వినియోగం జరిగితే సంబంధిత వ్యక్తులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలింగ్‌కు 44 గంటల ముందు నుండి రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సమావేశాలు, ర్యాలీలు లేదా ఏ విధమైన ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని సూచించారు. ఇతర ప్రాంతాల నుండి ప్రచారానికొచ్చిన వారు స్థానికంగా ఉండకూడదని, మంగళవారం సాయంత్రం 5 గంటలులోపు ఖాళీ చేయాలని ఆదేశించారు.

## పోలింగ్ విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

**– ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**



ఎన్నికల్లో ఎంతో ప్రాధాన్యత గల పోలింగ్ విధులను ప్రిసైడింగ్ అధికారులు సమర్థవంతంగా నిర్వ హించాలని వరంగల్ జిల్లా ఎన్ని కల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మంగ ళవారం సంగెం, గీసుగొండ జెడ్పిహెచ్ఎస్ లో జిల్లాలో రెండవ విడత లో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతులను కలెక్టర్ పరిశీలించి విధులకు సంబంధించి కీలకమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియలో పీ.ఓ లు క్రియాశీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని అన్నారు. నిబంధనలు పక్కాగా పాటిస్తూ పోలింగ్ ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం కల్పించకూడదని సూచించారు. సమయ పాలనను పాటిస్తూ, సకాలంలో నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలు, మార్గదర్శకాలను అధికారులు తప్పకుండా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రమేష్, ఎంపిడిఓ లు, తహశీల్దార్లు, ఎం పిఓలు, మాస్టర్ ట్రైనర్, పిఓ లు తదితరుల పాల్గొన్నారు.

## పన్ను బకాయి వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాల్సిందే



**వేద న్యూస్ , వరంగల్ టౌన్:**

పన్ను బకాయి వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాల్సిందేనని నగర మేయర్ గుండు సుధారాణి రెవిన్యూ అధికారులు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో పన్ను వసూళ్ల పై రెవేన్యూ ఇన్స్పెక్టర్ లు వార్డు ఆఫీసర్లు బిల్ కలెక్టర్ల తో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి పాల్గొని సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ వార్డు అధికారులు బిల్ కలెక్టర్ ల వారిగా ఇప్పటి వరకు వసూలు చేసిన పన్ను వసూళ్ల పురోగతిని అడిగి తెలుసుకొని మాట్లాడుతూ డిసెంబర్ 31 లోగా సూచించిన పన్ను వసూళ్లను చేరుకోవాలని ఆర్ఐలు, ఆర్ఓ లు నిరంతరం క్షేత్ర స్థాయిలో పన్ను వసూళ్లను పరిశీలించాలని పన్ను వసూళ్ల కు సమంతరం గా నీటి పన్ను వసూళ్ల చేయాలని బడా బకాయి దారుల పైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చాలా వరకు నగర వాసులు నల్లా పన్నులు చెల్లించడం లేదని ఆస్తి పన్ను లతో పాటు గా నల్లా పన్నులు చెల్లించి కార్పొరేషన్ కు సహకరించాలని ఈ సందర్భంగా మేయర్ నగర ప్రజలను కోరారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్ లు రవీందర్, ప్రసన్న రాణి, ఆర్ఓలు శ్రీనివాస్, షహజాది బేగం, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి

**– బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**



బీజేపీ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా మంగళవారం వరంగల్ జిల్లాలో క్రత్రియాల గ్రామ సర్పంచ్ అభ్యర్థి రాయపురం రమ్య, కదరిగూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థి కుందూరు లలితా మహేందర్ రెడ్డిని, పర్వతగిరి గ్రామ సర్పంచ్ అభ్యర్థి బోట్ల మధుని, ఇల్లంద గ్రామ సర్పంచ్ అభ్యర్థి అడుప రాజుని గెలిపించాలని ఇంటి ఇంటికి ఎన్నికల ప్రచారం నిర్వహించి పంచాయతీ ఎన్నికల్లో బిజెపి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ కోరడం జరిగింది. ఈ ఎన్నికల ప్రచారంలో ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు, మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్, కొండేటి శ్రీధర్, వన్నాల శ్రీరాములు, టీ. రాజేశ్వరరావు, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, జలగం రంజిత్ రావులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలన్నీ నిర్వీర్యం అయ్యాయని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రెండేళ్లుగా పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వమే నిధులు ఇస్తోందని, రోడ్లు, పీఎం కిసాన్, మరుగుదొడ్ల నిర్మాణం, ఉపాధి హామీ పథకం, వీధి దీపాలు, స్మశానాల అభివృద్ధి వంటి పనులు ఆ నిధులతోనే నిర్వహిస్తారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు సడక్ యోజన, జాతీయ రహదారులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, అన్నీ గ్రామీణాభివృద్ధికే అందుతున్నాయని పేర్కొన్నారు. "గ్రామాలు అభివృద్ధి చెందాలంటే బీజేపీని బలపరచండి" అని గంట రవికుమార్ స్పష్టం చేశారు.

# తెలంగాణ ఇచ్చిన దేవత సోనియమ్మ

**– ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**వేద న్యూస్,హనుమకొండ :**

హనుమకొండ డీసీసీ భవన్ లో కాంగ్రెస్ పార్టీ గౌరవ అధ్యక్షురాలు, పార్లమెంట్ సభ్యురాలు సోనియా గాంధీ 79 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హాజరయ్యారు. మొదట కేక్ కట్ చేసి హనుమకొండ జిల్లా ,వరంగల్ జిల్లా ప్రజల పక్షాన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సోనియా గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గౌరవ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ప్రతియేటా ఘనంగా నిర్వహిస్తున్నామని వారు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తు ,హనుమకొండ, వరంగల్ జిల్లా ప్రజల మరియు పార్టీ పక్షాన శుభాకాంక్షలు తెలియజేశారు .ప్రపంచంలోనే ఒకే ఒక్క కుటుంబం మొత్తం కూడా దేశం కోసం హత్యలకు గురైనారని,వారి త్యాగం చిరస్మరణీయమని అన్నారు.అలాంటి కుటుంబంలో నుంచి వచ్చిన సోనియా గాంధీని బీజేపీ నాయకులు ఎన్నో సార్లు అపనిందలు,అవమానాలు చేసిన నిలదొక్కుకున్న విషయాన్ని గుర్తు చేశారు.మెట్టినింటికి వచ్చి గాంధీ వారసత్వం ఎలా వుంటదని అవహేళన చేసిన మూరు?లు బీజేపీ నాయకులు.ఆనాడు దేశానికి ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చినప్పుడు కూడా మన్మోహన్ సింగ్ ని ప్రధానిగా చేసిన నాయకురాలు సోనియా గాంధీ అని అన్నారు.దేశంలో రూపాయి పతనం,ఇండిగో విమానాల రద్దును ప్రజల నుంచి ప్రజల తప్పుదోవ పట్టిం చేలా ప్రధాని మోడీ నెహ్రూని విమర్శించడం సరికాదన్నారు.దేశంలో జరుగుతున్న ఆర్థిక సంక్షోభం పై బీజేపీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గాంధీజీని చెప్పిన గాడ్సే గొప్పోదనడం సిగ్గుచేటు అని ,మీరూ మీ పార్టీ దేశానికి చేసింది



ఏంటని అన్నారు. వరంగల్ జిల్లా ప్రజల మరియు పార్టీ పక్షాన శు భాకాంక్షలు తెలియజేశారు .ప్రపంచంలోనే ఒకే ఒక్క కుటుంబం మొత్తం కూడా దేశం కోసం హత్యలకు గురైనారని,వారి త్యాగం చిరస్మరణీయమని అన్నారు.అలాంటి కుటుంబంలో నుంచి వచ్చిన సోనియా గాంధీని బీజేపీ నాయకులు ఎన్నో సార్లు అపనిందలు,అవమానాలు చేసిన నిలదొక్కుకున్న విషయాన్ని గుర్తు చేశారు.మెట్టినింటికి వచ్చి గాంధీ వారసత్వం ఎలా వుంటదని అవహేళన చేసిన మూరు? రూపాయి పాతనానికి కారణం బీజేపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలే అని అన్నారు. ఈ వేడుకలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లు బొద్దిరెడ్డి ప్రభాకర్, ఈ వీ శ్రీనివాస్ రావు,టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు,జిల్లా గ్రంధాలయం సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న మరియు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ,కార్పొరేటర్లు,మాజీ కార్పొరేటర్లు, ంంనాయకులు అభిమానులు పాల్గొన్నారు.

## రెండు కార్లు ఢీకొని ముగ్గురుమృతి..

**అమరావతి వేద న్యూస్ :**




ఏపీలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా నగరి మండలం తడుకుపేట వద్ద రెండు కార్లు ఢీ కొన్నాయని వివరిం చారు. ఈ ప్రమాదంలో ఇద్దరు తిరుచా నూరు పద్మావతి అమ్మవారి ఆలయ పోటు కార్మికులు సంతానం, శంకర్, మరొకరు తమిళనాడు వాసి అరుణ్ మృతి చెందారని వెల్లడించారు. గాయపడిన ముగ్గురూ తమిళనాడు వాసులను ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు

# ఇందిరా గాంధీ జయంతి

- భారత దేశ నిర్మాణంలో అజరామర నాయకత్వం ఇనుప మేడం చూపించిన దారి
- దేశ పునర్నిర్మాణంలో కీలక పాత్ర
- బలమైన నాయకత్వానికి ప్రతీకగా నిలిచిన ఇనుప మేడం
- భారత రాజకీయాలపై ఆమె చెరగని ముద్ర

**వేద న్యూస్ డెస్క్:**

ఈ రోజు భారతరాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన నాయకురాలు, మాజీ ప్రధానమంత్రి ఇందిరా ప్రియదర్శిని గాంధీ జయంతి. దేశ నిర్మాణం, సంక్షోభ సమయాల్లో తీసుకున్న నిర్ణయాలు, అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి తీసుకువచ్చిన గౌరవం ఇవన్నీ ఆమెను భారత రాజకీయాల్లో అజరామర వ్యక్తిత్వంగా నిలబెట్టాయి. భారతదేశాన్ని ప్రపంచ వేదికపై బలమైన స్వరంగా నిలబెట్టిన నాయకురాలు ఎవరు అంటే, అందరూ ఒక్కసారిగా గుర్తుచేసేది ఇందిరానే.ఇందిరా గాంధీ దేశాన్ని నడిపిన కాలం అత్యంత క్లిష్టమైనది. ఆర్థిక సమస్యలు, అంతర్గత అల్లర్లు, అంతర్జాతీయ ఒత్తిడులు దేశాన్ని పరీక్షించిన కాలంలో ఆమె చూపిన ధైర్యం అపూర్వం. 1971లో బెంగాల్ శరణార్థుల సంక్షోభం, పాకిస్తాన్‌తో యుద్ధం వంటి పరిస్థితుల్లో ఆమె తీసుకున్న నిర్ణయాలు కేవలం రాజకీయ నాయకత్వం కాదుదేశాన్ని రక్షించాలనే ధృఢనిశ్చయానికి నిలువు దర్పణం. ఈ యుద్ధ ఫలితంగా బంగ్లాదేశ్ అనే కొత్త దేశం పుట్టుకొచ్చింది. ఆ విజయంతో భారతదేశ ప్రతిష్ట ప్రపంచంలో అమితంగా పెరిగింది. అప్పటి అమెరికా ప్రెషర్‌ను లెక్కచేయకుండా దేశ ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయం ఆమె నాయకత్వ సందర్భంలో అత్యంత ప్రస్తావనీయ ఘట్టం.దేశాన్ని పరిశ్రమల వైపు నడిపేందుకు పలు రంగాలను జాతీయాకరించిన సందర్భంలో ఆమె ఆర్థిక దూరదృష్టి స్పష్టమవుతుంది. బ్యాంకుల జాతీయాకరణతో గ్రామీణ భారతానికి క్రెడిట్ ద్వారాలు తెరుచుకున్నాయి. మహిళల స్వావలంబన, పేదల సంక్షేమం, సామాజిక న్యాయం వంటి అంశాల్లో కూడా ఆమె చూపిన ఆసక్తి పేదల మనస్సుల్లో ఆమెను 'మాతృస్వరూపం'గా నిలబెట్టింది. 'గరీబీ హటావో' నినాదం కేవలం ఎన్నికల నినాదం కాకుండా, అప్పటి భారతదేశంలోని అసమానతలను తగ్గించే ప్రయోగానికి ప్రాథమిక అస్త్రం అయింది.అంతర్జాతీయ వేదికపై ఇనుప మేడం ప్రతిష్ట వేరే స్థాయిలో నిలిచింది. గ్లోబల్ సౌత్‌కు ఆమె స్వరం భారతదేశాన్ని మూడో ప్రపంచ దేశాల నాయకత్వ స్థానం వైపుకు నడిపించింది. అణ్వస్త్ర విధానంలో భారతదేశం స్వయంప్రతిపత్తిని కాపాడేందుకు ఆమె చేసిన కృషి కూడా కీలకం. 1974లో పోఖ్రాన్ పరీక్షలతో భారతదేశం అణ్వస్త్ర సామర్థ్యం ఉన్న దేశంగా ప్రపంచానికి ప్రకటించింది. ఇది ప్రమాదకర నిర్ణయం అయినప్పటికీ, దేశ భద్రత, భవిష్యత్ వ్యూహాలలో దీని ప్రాధాన్యత అపారం.ఇందిరా గాంధీ నాయకత్వంపై విమర్శలు కూడా ఉన్నాయిఅత్యవసర పరిస్థితి వంటి నిర్ణయాలు భారత ప్రజాస్వామ్య చరిత్రలో తీవ్రమైన చర్చలకు కారణమయ్యాయి. కానీ ఆమె నాయకత్వ గాథలో ఓ విషయం మాత్రం ఎవరూ తిరస్కరించలేరు: ఆమె ధైర్యం, సంకల్పం, ప్రజాస్వామ్యం మరియు దేశాభివృద్ధిపై ఆమెకున్న అచంచల నిబద్ధత. ఆమె దేశ ప్రయోజనాల కోసం ఎంతటి ఒత్తిడి వచ్చినా వెనక్కి తగ్గని నాయకురాలు.ఆమె మరణం కూడా దేశానికి ఒక పెద్ద దెబ్బ. అయినప్పటికీ, ఆమె చూపిన మార్గం, తీసుకున్న ధైర్య నిర్ణయాలు, నిర్మించిన శక్తివంతమైన దేశ పాత్ర ఇప్పటికీ భారత రాజకీయాలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. ఒక మహిళగా రాజకీయాల్లో అత్యున్నత అధికారాన్ని చేపట్టి దాన్ని సమర్థంగా వినియోగించిన ప్రథమ నాయకురాలిగా ఆమెకు ఉన్న గౌరవం అపురూపం.ఇందిరా గాంధీ పుట్టినరోజు కేవలం ఒక రాజకీయ నాయకురాలి జయంతి కాదు; దేశ ఆత్మవిశ్వాసం, ధైర్యం, స్వయంప్రతిపత్తి, సంకల్పబలయిశ్రీశ్రీ తీశ్రీశ్రీవస ఱత్శీ శీఅవ జూవతీంశీఅన్న భావానికి గుర్తుగా నిలిచే రోజు. ఆమె చూపిన దారిలో భారతదేశం నడిచిన సంవత్సరాలు దేశానికి దృఢ పునాదులను సమకూర్చాయి.

# అవినీతి నిర్మూలనకు సామూహిక కట్టుబాటు అవసరం

- ఖమ్మంలో అవినీతి నిరోధక వారోత్సవ ర్యాలీ
- జిల్లా జడ్జి రాజగోపాల్ ఆధ్వర్యంలో అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన

**వేద న్యూస్, ఖమ్మం :**

అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం సందర్భంగా అవినీతి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన పెంపు కోసం ఖమ్మం పట్టణంలో విస్తృత కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 3 నుంచి 9 వరకు అవినీతి నిరోధక వారోత్సవాన్ని పాటిస్తున్న తెలంగాణ అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో, ఖమ్మం జిల్లా జడ్జి జి. రాజగోపాల్ నేతృత్వంలో ర్యాలీ జరిగింది. న్యాయ అధికారులతో పాటు 'అనిశా' బృంద సభ్యులు మరియు ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ కాలేజీలు, పాఠశాలల ఉపాధ్యా యులు, లెక్చరర్లు, విద్యార్థులు కూడా ర్యాలీలో భాగమయ్యారు. పట్టణంలో అవినీతి వ్యతిరేక నినాదాలు, టోల్‌ఫ్రీ 1064 నెంబర్ ఉన్న బ్యానర్లతో ఈ ర్యాలీ నిర్వహించబడింది. ఈ నెంబర్ ద్వారా లంచం డిమాండ్ చేసే ఘటనలను తక్షణమే ఫిర్యాదు చేయవచ్చని అధికారులు ప్రజలకు సూచించారు. "ఎవరైనా లంచం అడిగితే వెంటనే 1064 కు కాల్ చేయండి, ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి" అని జిల్లా జడ్జి ప్రజలకు స్పష్టం చేశారు. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపుని చ్చారు. అవినీతి



నిరోధక వారోత్సవం సందర్భంగా జిల్లాలో వివిధ అవగాహన కార్యక్రమాలు, చర్చావేదికలు, మానవ శ్రేణులు కూడా నిర్వహించబోతున్నట్లు అధికారులు తెలిపారు. పౌరులు చురుకైన భాగస్వామ్యంతో అవినీతి నిర్మూలన సాధ్య మవుతుందని, యువత ఈ ఉద్యమంలో ముందుండాలని అధికారులు కోరారు.

# ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి




- తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్
- కాంగ్రెస్ హామీలు అమలు కాలేదని విమర్శ
- ఖైరతాబాద్ ఆర్టీఏ ఎదుట ఆటో జేఏసీ నిరసన
- ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరిక

**వేద న్యూస్, హైదరాబాద్ :**

ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్ డిమాండ్ చేశారు. ఆటో జేఏసీ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు ఏటా రూ. 12 వేలు అందిస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం కనికరం లేకుండా వ్యవహరిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ఆత్మహత్యలు చేసుకునే స్థితికి చేరినా, వారి సమస్యలపై ఒకసారి కూడా మంత్రి వర్గంలో చర్చ జరగడం లేదంటే ఎంతటి నిర్లక్ష్యమో స్పష్టమవుతుంది" అని రూప్ సింగ్ అన్నారు. గత రెండు సంవత్సరాలుగా ఆటో యూనియన్లు ఎన్నిసార్లు నిరసనలు వ్యక్తం చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆటోమీద ఆధారపడే వేల కుటుంబాల భవిష్యత్తు సంక్షోభంలో ఉందని, ప్రభుత్వం హామీలు అమలు చేయకపోతే ప్రజల నమ్మకాన్ని కోల్పోతుందని రూప్ సింగ్ స్పష్టం చేశారు. వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, అవసరమైతే జాగృతి తరఫున రాష్ట్రవ్యాప్తంగా నిరంతర పోరాటాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నది ఆటో డ్రైవర్ల ఆకాంక్షగా నిలుస్తున్న తరుణంలో, ఈ నిరసన రాష్ట్ర రాజకీయాల్లో మరో చర్చకు దారితీసింది.

# కేంద్ర పథకాల పేరిట పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు

- అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసుల హెచ్చరిక

**వేద న్యూస్ డెస్క్:**




కేంద్ర ప్రభుత్వ పథకాల పేరుతో ప్రజలను ఉద్దేశించి సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ పోలీసులు జాగ్రత్త హెచ్చరికలు జారీ చేశారు. వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా వేదికల్లో నకిలీ పథకాల పేరుతో తప్పుడు లింకులను షేర్ చేస్తూ ప్రజలను మోసగాళ్లు తప్పుదారి పట్టిస్తున్నారని పోలీసులు వెల్లడించారు. సమాజంలో విస్తృతంగా ప్రచారం అవుతున్న "బేరోజగారి భతా యోజన 2025", "ఉచిత ల్యాప్‌టాప్ పథకం" వంటి పోస్టర్లు పూర్తిగా నకిలీవని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ప్రకటనలు నిజమైన ప్రభుత్వ పథకాలతో ఎలాంటి సంబంధం లేకుండానే మోసపూరితంగా తయారు చేసి ప్రచారం చేస్తున్నారని తెలిపారు.సైబర్ మోసగాళ్లు సెంట్రల్ గవర్నమెంట్ పేరును ఉపయోగించి ప్రజల విశ్వాసాన్ని దొంగిలిస్తున్నారు. 'ఇక్కడ క్లిక్ చేయండి', 'మీ పేరు నమోదు చేసుకోండి', 'మీకు డబ్బులు అందుతాయి' అంటూ పంపే లింకులపై క్లిక్ చేస్తే ఫోన్, బ్యాంక్ సమాచారాన్ని దొంగిలించే ప్రమాదం ఉందని పోలీసులు హెచ్చరించారు. ఈ లింకుల ద్వారా వ్యక్తిగత వివరాలను సేకరించి తర్వాత ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. పౌరులు కేవలం అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్లు, నోటిఫికేషన్లను మాత్రమే నమ్మాలని, సోషల్ మీడియాలో వచ్చే ఏ పథకాల ప్రచారాన్నీ విశ్వసించకూడదని పోలీసులు సూచించారు. సందేహాస్పద లింకులను పూర్తిగా నిర్లక్ష్యం చేయాలని, అటువంటి మెసేజీలను ఫార్వర్డ్ చేయొద్దని విజ్ఞప్తి చేశారు. నకిలీ పథకాలు, స్కామ్‌లపై సమాచారం లభించిన వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రజల భద్రత కోసం ఈ అవగాహన చాలా అవసరమని, అప్రమత్తతవల్లే మోసాలను అడ్డుకట్ట వేయవచ్చని తెలంగాణ పోలీసులు పేర్కొన్నారు.

# 'ఆదిత్య'లో మెగా వెల్‌నెస్ క్యాంప్

- హెల్త్ చెకప్‌కి 50 శాతం తగ్గింపు
- ఈ నెల 15 వరకు మాత్రమే.

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్ ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఈ నెల 15 వరకు మెగా వెల్‌నెస్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ ఎలుక దేవేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రివెంటివ్ హెల్త్ చెకప్‌కి 50 శాతం తగ్గింపు ధరలు ఉంటాయని వెల్లడించారు. ఇయర్ ఎండ్ ఆఫర్‌లో భాగంగా డిసెంబర్ నెలలో ఈ మేరకు ధరల తగ్గింపు ఉంటుందని పేర్కొన్నారు. 'ఆరోగ్యం' క్యాంప్ ప్రొఫైల్ 1 కింద..రూ.1,149లో భాగంగా 62 పేరామీటర్స్, 'ఆరోగ్యం' క్యాంప్ ప్రొఫైల్ 2 కింద..రూ.1,699లో భాగంగా 69 పేరామీటర్స్, 'ఆరోగ్యం' క్యాంప్ ప్రొఫైల్ 3 కింద.. రూ.2,399లో భాగంగా 78 పేరామీటర్స్..ను టెస్టుల్లో భాగంగా వెల్లడించనున్నారు. ఈ టెస్టులలో లిపిడ్, లివర్, కిడ్నీ, థైరాయిడ్, దయాబెటిస్ ప్రొఫైల్స్, విటమిన్ ప్రొఫైల్, ఐరన్ డెఫిసీయన్సీ ప్రొఫైల్, సీ-రియాక్టివ్ ప్రొటీన్ ఉంటాయి. ఈ ఆఫర్ ఈ నెల 15 వరకు మాత్రమే ఉంటుందని, జమ్మికుంట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ టెస్టులకు వచ్చే వారు 10 నుంచి 12 గంటల వరకు ఫాస్టింగ్ తప్పనిసరిగా చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని పూర్తి వివరాలకు ఆదిత్య మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని సంప్రదించొచ్చు.

# అనాథ బాలికల విద్య కోసం లేడీస్ సర్కిల్ నిధి సేకరణ

**అమరావతి, వేద న్యూస్:**

- కార్యక్రమానికి హాజరైన మంత్రి అనిత
- కోదాడలో పేద పిల్లల కోసం పాఠశాల నిర్మాణం లక్ష్యం

అనాథ బాలికల విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్న మహిళా స్వచ్ఛంద సంస్థ విజయవాడ లేడీస్ సర్కిల్, విజయవాడ రౌండ్ టేబుల్ ఆధ్వర్యంలో పాఠశాల నిర్మాణం కోసం చేపట్టిన నిధి సేకరణ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. విజయవాడ చీూజ కళ్యాణవేదికలో నిర్వహించిన పోటీలకు మంత్రి ప్రారంభం పలికి, ఆ తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలను తిలకించారు. కోదాడలో పేద పిల్లల కోసం నిర్మించబోయే పాఠశాల కోసం రూ.50 లక్షల నిధుల సేకరణ లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించగా, అనేకమంది మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయం అని మంత్రి అనిత చెప్పారు. కృష్ణా జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ గద్దె అనూరాధతో కలిసి విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన మంత్రి, పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్న లేడీస్ సర్కిల్ స్వచ్ఛంద సేవను ప్రశంసించారు. "సామాజిక సేవ అంటే ప్రజల జీవితాలను మార్చే కర్తవ్య భావం. అనాథ బాలికలు, పేద పిల్లల భవిష్యత్తును వెలిగించే ప్రయత్నం చేస్తున్న లేడీస్ సర్కిల్ సభ్యులు ప్రత్యేక అభినందనలు అర్హులు" అని అనిత పేర్కొన్నారు.




# రంగారెడ్డిలో లంచం దందా బహిర్గతం

**హైదరాబాద్, వేద న్యూస్ :**



రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో పనిచేస్తున్న పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ హనుమ రవీందర్ నాయక్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఫిర్యాదుదారుడిపై నమోదైన పీడీఎస్ రైస్ కేసును క్లియర్ చేయడానికీ, జరిమానా విధించి రేషన్ షాప్ తిరిగి తెరిచేందుకు సహాయం చేస్తానని చెప్పి రూ.20 వేల లంచం స్వీకరించిన సమయంలో అధికారులు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో అవినీతి వ్యవహారాలు మరోసారి బయటపడ్డాయి. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యుడే లంచం డిమాండ్ చేయడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేపింది. ఆధారాలతో కూడిన సాక్ష్యాలతో కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు, నిందితుడిపై దర్యాప్తు వేగవంతం చేశారు.లంచం కోరే ఏ ప్రభుత్వ ఉద్యోగి గురించి సమాచారం ఉన్న వెంటనే టోల్ ఫ్రీ 1064కు కాల్ చేయాలని, అదనంగా వాట్సాప్ 9440446106, ఫేస్‌బుక్ వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని అవినీతి నిరోధక శాఖ విజ్ఞప్తి చేసింది. "ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయి" అని ఏసీబీ మరోసారి స్పష్టం చేసింది.ఈ చర్యతో రంగారెడ్డి జిల్లాలో పౌరసరఫరాల శాఖలో అవినీతిపై కఠిన సందేశం వెళ్లినట్లు అధికారులు పేర్కొన్నారు.

# జీ5లోకి వరుణ్ సందేశ్ 'నయనం'




**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ యంగ్ హీరో వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న డిజిటల్ క్రైమ్ థ్రిల్లర్ 'నయనం' జీ5లో స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. స్వాతి దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్ డిసెంబరు 19న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సిరీస్‌పై మంచి ఆసక్తిని పెంచుతోంది. ట్రైలర్ ప్రారంభం నుంచే కథలో దాగి ఉన్న మిస్టరీని రహస్యంగా చూపించే విధానం ఆకట్టుకుంది. వరుణ్ సందేశ్ పోషించిన పాత్ర చుట్టూ సాగుతున్న సంఘటనలు, అనుమానాలు, అన్వేషణ, అనుకోని మలుపులు – ఇవన్నీ థ్రిల్లర్ వాతావరణాన్ని మరింత బలపడేలా చేశాయి. ప్రతి ఫ్రేమ్‌లో టెన్షన్ పెంచే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, కథనం వేగం, డిజిటల్ క్రైమ్ అంశాల ప్రెజెంటేషన్ ట్రైలర్‌ను ప్రత్యేకంగా నిలబెట్టాయి. క్రైమ్, హ్యాకింగ్, మానసిక ఒత్తిడులు, నిజాలు – అబద్ధాల మధ్య జరిగే డ్రామాను ఆధారంగా చేసుకుని కథ సాగుతుందనే సంకేతాలు ట్రైలర్‌లో కనిపించాయి. వరుణ్ సందేశ్ కెరియర్‌లో కీలకమైన ప్రాజెక్ట్‌గా కూడా ఇది భావిస్తున్నారు. డిసెంబరు 19 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కాబోయే 'నయనం' సిరీస్‌పై ఇప్పుడు ప్రేక్షకుల్లో ఆసక్తి మరింతగా పెరిగింది


# వి. శాంతారామ్ బయోపిక్‌లో కథానాయికగా తమన్నా

**వేద న్యూస్ డెస్క్:**

భారతీయ సినీ చరిత్రలో మహోన్నత స్థానాన్ని సంపాదించిన దిగ్గజ దర్శకనట – నిర్మాత వి. శాంతారామ్ జీవితం ఇప్పుడు వెండితెరపై రూపుదిద్దుకోబోతోంది. ఆయన పేరును వర్తమాన తరాలకు పరిచయం చేసే ఈ భారీ బయోగ్రాఫికల్ చిత్రం బాలీవుడ్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మితమవుతోంది. ఈ జీవితకథా చిత్రానికి 'వి. శాంతారామ్' అనే పేరునే ఖరారు చేశారు. ప్రధాన పాత్రలో యువ నటుడు సిద్ధాంత్ చతుర్వేది నటిస్తుండగా, దర్శకుడిగా అభిజీత్ శిరీష్ దేశ్‌పాండే వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే సిద్ధాంత్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసిన చిత్రబృందం, ఇప్పుడు హీరోయిన్‌గా తమన్నా భాటియాను అధికారికంగా ప్రకటించింది. ఆమె ఆకట్టుకునే ఫస్ట్ లుక్‌ను కూడా విడుదల చేశారు. ఈ భారీ ప్రాజెక్టును రాహుల్ కిరణ్ శాంతారామ్, సుభాష్ కాలే, సరిత అశ్విన్ వర్దే కలిసి నిర్మిస్తున్నారు. సైలెంట్ సినిమాల యుగం నుంచి టాకీల కాలం, ఆపై రంగుల చిత్రాల దశ వరకు భారత సినీ ప్రపంచం ఎదుర్కొన్న మార్పులను, ఆ ప్రయాణంలో వి. శాంతారామ్ చేసిన అద్భుత కృషిని ఈ చిత్రం సజీవంగా చూపించబోతోంది.

వి. శాంతారామ్ సినీ ప్రయాణం

1901 నవంబరు 18న మహారాష్ట్రలోని కోల్హాపూర్‌లో జన్మించిన శాంతారామ్, 1921లో నటుడిగా తొలి అడుగు వేశారు. తరువాత దర్శకుడిగా 55కు పైగా చిత్రాలు తీర్చిదిద్దారు. నిర్మాతగా 92 సినిమాలకు పైగా వ్యవహరించారు. ఆయన స్థాపించిన ప్రభాత్ ఫిల్మ్ కంపెనీ (1929), రాజ్‌కమల్ కళామందిర్ (1942) భారత చిత్ర పరిశ్రమకు చిరస్మరణీయ సంస్థలుగా నిలిచాయి. సినీ రంగానికి చేసిన అసమాన సేవలకు గాను భారత ప్రభుత్వం శాంతారామ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు (1985), మరణానంతరం పద్మవిభూషణ్ (1992) పురస్కారాలతో గౌరవించింది. ఇప్పుడీ మహానుభావుడి ప్రయాణం తెరపై ఎలా ఆవిష్కృతమవుతుందో అన్న ఆసక్తి సినీ వర్గాల్లో పెరుగుతోంది




# ప్రభాస్ ఎంట్రీ సాంగ్ థియేటర్లను షేక్ చేయనున్నదా?


**వేద న్యూస్ డెస్క్:**



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ – సెన్సేషన్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తోన్న 'స్పిరిట్' సినిమాపై రోజురోజుకీ అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. 'అర్జున్ రెడ్డి', 'కబీర్ సింగ్', 'యానిమల్' తరహా రా – ఇంటెన్స్ కథలతో వంగా చూపించిన మాస్ మేకింగ్ స్టైల్ వల్ల, ఈసారి ప్రభాస్‌ను ఎలాంటి వైల్డ్ అవతారంలో చూపిస్తాడో అన్న ఆసక్తి గరిష్ఠానికి చేరింది. తాజా సమాచారం ప్రకారయి'స్పిరిట్' కోసం ఒక అత్యంత భారీ పోలీస్ స్టేషన్ సెట్‌ను నిర్మిస్తున్నారు. ఇది సాధారణ సెట్ మాత్రమే కాకుండా, సినిమాలో కీలక పాత్ర పోషించేలా భారీగా, రియలిస్టిక్ స్టైల్‌లో ప్రత్యేక డిజైన్‌తో తయారవుతోంది. ఈ సెట్‌లోనే ప్రభాస్ ఎంట్రీ సాంగ్‌ను చిత్రీకరించడానికి ప్రిపరేషన్స్ జరుగుతున్నాయి. వంగా సినిమాల్లో హీరో ఎంట్రీ ఎంత వైల్డ్, ఎంత ఇంపాక్ట్‌ఫుల్‌గా ఉంటుందో ప్రేక్షకులందరికీ తెలిసిందే. అదే స్టైల్‌ను మించి, ప్రభాస్‌కు మరింత రా, అగ్రెసివ్, మాస్ ఎంట్రీని ఈసారి ప్లాన్ చేస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. పాటతోపాటు ఈ లొకేషన్‌లోనే ఒక భారీ యాక్షన్ ఎపిసోడ్ కూడా షూట్ చేయడానికి సిద్ధమవుతున్నారు. డార్క్ లైటింగ్, ఇంటెన్స్ ఫ్రేమింగ్, వంగా మార్క్ స్టైల్ గా ప్రేక్షకులను థియేటర్లలో తాళ్లతో ఉర్రూతలూగించేలా మాస్ ఎనర్జీ క్రియేట్ అవుతుందని టాక్. ఇన్‌సైడ్ బజ్ ప్రకారం, ప్రభాస్ ఇప్పటివరకు ఎప్పుడూ చేయని రీతిలో ఒక వైల్డ్, రఫ్, రా పోలీస్ ఆఫీసర్గా కనిపించబోతున్నారు. లుక్ నుంచి బాడీ లాంగ్వేజ్ వరకు, ఈ పాత్ర పూర్తిగా ఇంటెన్స్‌తో నిండిపోయి, వంగా ట్రీట్‌మెంట్‌తో మరో లెవెల్‌కు వెళ్లనుంది. ఇప్పటికే చిత్ర బృందం పూజా కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించింది. ప్రస్తుతం భారీ సెట్లతో షూటింగ్‌కు ఈ సెట్‌లోనే ప్రభాస్ ఎంట్రీ సాంగ్‌ను చిత్రీకరించడానికి ప్రిపరేషన్స్ జరుగుతున్నాయి. వంగా సినిమాల్లో హీరో ఎంట్రీ ఎంత వైల్డ్, ఎంత ఇంపాక్ట్‌ఫుల్‌గా ఉంటుందో ప్రేక్షకులందరికీ తెలిసిందే. అదే స్టైల్‌ను మించి, ప్రభాస్‌కు మరింత రా, అగ్రెసివ్, మాస్ ఎంట్రీని ఈసారి ప్లాన్ చేస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. పాటతోపాటు ఈ లొకేషన్‌లోనే ఒక భారీ యాక్షన్ ఎపిసోడ్ కూడా షూట్ చేయడానికి సిద్ధమ వుతున్నారు. సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రతి కొత్త అప్‌డేట్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ప్రభాస్ – వంగా కాంబినేషన్ నుంచి ప్రేక్షకులకు కావలసిందిబ్లడ్ రష్ ఇచ్చే మాస్, ఎమోషన్, వైలెన్స్, ఆథారిటీవ్ పోలీస్ పవర్. ఇవి అన్నీ 'స్పిరిట్'లో రెట్టింపు అవుతాయని సినీ విశ్లేషకుల అంచనా.

# త్రీ ఇడియట్స్ సీక్వెల్ వస్తోంది

**వేద న్యూస్ డెస్క్:**




భారత సినీ ప్రేక్షకులను చిరకాలం మ్యాజిక్‌లో ముంచేసిన 'త్రీ ఇడియట్స్' ఇప్పుడు సీక్వెల్‌తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతుందని తాజా సమాచారం చెబుతోం ది. అమీర్ ఖాన్, మాధవన్, షర్మన్ జోషి ప్రధాన పాత్రల్లో వచ్చిన ఈ కల్ట్ క్లాసిక్ సినిమా భారతీయ సినిమా చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిన సంగతి తెలిసిందే. ఈ ఐకానిక్ చిత్రం సీక్వెల్‌పై ఎన్నో సంవత్సరాలుగా వస్తున్న వార్తలకు ఇప్పుడు నిజమైన రూపం దక్కినట్టు తెలుస్తోంది. సీక్వెల్‌కు సంబంధించిన స్క్రిప్ట్ పూర్తిగా ఫైనల్ అయ్యిందని బాలీవుడ్ వర్గాలు వెల్లడించాయి. రాజ్ కుమార్ హిరానీ – అమీర్ ఖాన్ కాంబినేషన్ మళ్లీ జోష్‌లో ఉందని, మొదటి భాగం అందించిన ఫన్, ఎమోషన్, జీవితాన్ని మార్చే సందేశాలు – ఇవన్నీ కొత్త యాంగిల్‌లో, కొత్త జర్నీతో తిరిగి వచ్చే అవకాశముందని టీం భావిస్తుంది. తాజా కథనం ప్రకారం కథ 15 ఏళ్ల తర్వాత మొదటి భాగం ముగిసిన చోట నుంచే ముందుకు సాగనుందట. హీరోలైన రాంచో, ఫర్హాన్, రాజు %–% జీవితంలో పెద్ద పెద్ద మార్పులతో, వారివారి దారుల్లోకి వెళ్లిపోయిన తర్వాత మరో కొత్త అడ్వెంచర్ కోసం మళ్లీ కలుసుకోవడం ఈ సీక్వెల్ కథలో కీలకం కానుంది. దాదా సాహెబ్ ఫాల్కే బయోపిక్ నిలిచిపోవడంతో రాజ్ కుమార్ హిరానీ తన పూర్తి దృష్టినీ 'త్రీ ఇడియట్స్ 2' పై పెట్టినట్టు సమాచారం. ఒరిజినల్ సినిమా గొప్పదనానికి ఏమాత్రం నష్టం కలగకుండా, అలాగే కొత్త కథకు శక్తివంతమైన స్క్రీన్‌ప్లే ఇవ్వాలనే లక్ష్యంతో స్క్రిప్ట్‌ను తీర్చిదిద్దుతున్నారట. ఎప్పుడొస్తుందన్నది కంటే "ఎలా వస్తోంది" అన్నదే ముఖ్యం అన్నట్టు, హిరానీ ఈ సీక్వెల్‌ను కూడా అదే లెజెండరీ లెవెల్‌లో తీసుకురావడానికి పట్టుదలతో ఉన్నాడు. ప్రేక్షకులు ఎంతోకాలం ఎదురు చూసిన 'త్రీ ఇడియట్స్' సీక్వెల్ ఇప్పుడు ఫుల్ ఫోకస్‌లోకి రావడంతో హైప్ ఆకాశాన్నంటుతోంది.

# ఇంగ్లండ్‌కు మరో షాక్

## – యాషెస్ నుండి వుడ్ ఔట్ కమిన్స్ అడిలైడ్‌కు రెడీ



**వేద న్యూస్ డెస్క్:**

యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్‌కు ఎదురుదెబ్బలు ఆగేలా లేవు. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఘోర పరాజయాలు చవిచూసిన బెన్ స్టోక్స్ సేన మరోసారి బలహీనపడింది. ప్రధాన వేగి మార్క్ వుడ్ మోకాలి గాయం మళ్లీ తీవ్రం కావడంతో సిరీస్ మొత్తానికి తప్పుకున్నాడు. గబ్బా పోరులో ఆడలేని వుడ్, మిగిలిన మూడు టెస్టులకు కూడా అందుబాటులో ఉండడంలేదు. ఏడాది నుంచి గాయాలతో ఇబ్బంది పడుతున్న అతడు ఇప్పుడు స్వదేశంలోని పునరావాస కేంద్రంలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందనున్నాడు.ఇంతలో ఆస్ట్రేలియా జట్టుకూ దెబ్బ తప్పలేదు. తొడకండరాల గాయంతో తొలి రెండు టెస్టులకు దూరమైన జోష్ హేజిల్‌వుడ్ ఈ సిరీస్ మొత్తం తప్పుకుంటున్నాడు. అడిలైడ్ పోరుకు సిద్ధం కావాలన్న జట్టు ప్రయత్నం ఫలించలేదు. అయితే వచ్చే ఏడాది జరగబోయే ఇరవై ఇరవై ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని అతడిని పూర్తిగా కోలుకునేలా విశ్రాంతి ఇచ్చినట్లు ప్రధాన కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ తెలిపారు.ఆస్ట్రేలియా శిబిరంలో మరోవైపు శుభవార్త కూడా చేరింది. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న ప్యాట్ కమిన్స్ అడిలైడ్ టెస్టులో జట్టుని నడిపించబోతున్నాడు. తొలి రెండు పోరుల్లో ఆస్ట్రేలియాకు విజయాలు అందించిన స్టీవ్ స్మిత్ మూడో టెస్టులో ఉపసారథిగా కొనసాగనున్నాడు. డిసెంబర్ 17న ప్రారంభమయ్యే అడిలైడ్ పరీక్షలో కమిన్స్ రాకతో ఆస్ట్రేలియా బౌలింగ్ బలం మరింత పెరుగుతుందని విశ్లేషకుల అభిప్రాయం.తొలి రెండు మ్యాచ్‌ల్లోనే బలహీనతలు బయటపడిన ఇంగ్లండ్‌కు మార్క్ వుడ్ గైర్హాజరు మరింత చిక్కు పరిస్థితే. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ లయ దొరకని బెన్ స్టోక్స్ సేన అడిలైడ్‌లో అయినా తిరిగి పుంజుకోవాలని తహతహలాడుతోంది. మరోవైపు 2–0 ఆధిక్యంలో ఉన్న ఆస్ట్రేలియా ఈ పోరుతోనే సిరీస్‌ను కైవసం చేసుకోవాలని చూస్తోంది.

# తొలి టీ 20 పోరులో భారత్ ఘన విజయం

## – భారత్ 101 పరుగుల తేడాతో దుమ్మురేపింది

**వేద న్యూస్ డెస్క్:**



. దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా జరిగిన తొలి ఇరవైఓవర్ల పోరులో భారత్ అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. 176 పరుగుల లక్ష్యాన్ని ఎదుర్కొన్న ఆతిథ్య జట్టు భారత బౌలర్ల ముందు పూర్తిగా చేతులెత్తేసింది. ఆరంభం నుంచే పరుగుల ప్రవాహాన్ని అడ్డుకున్న భారత్ బౌలర్లు ఒక్కో దశలో ఒత్తిడి పెంచుతూ ప్రత్యర్థిని 74 పరుగులకే కట్టడి చేశారు. ఈ ఘన విజయంతో ఐదు ఇరవైఓవర్ల సిరీస్‌లో భారత్ 10 ఆధిక్యంలో నిలిచింది.మొదట బ్యాటింగ్ చేసిన భారత్ ఆరంభంలో జాగ్రత్తగా నిలిచి తర్వాత దూకుడుతో పరుగులు రాబట్టింది. కీలక సమయాల్లో వచ్చిన సరిసమాన భాగస్వామ్యాలు స్కోరు బోర్డుపై వేగాన్ని తీసుకువచ్చాయి. మధ్యవరుసలో వచ్చిన బలమైన షాట్లు జట్టుకు మరింత ఊపు జోడించాయి. ఇన్నింగ్స్ చివర్లో వచ్చిన వేగవంతమైన రన్స్ భారత్‌ను 176 పరుగుల గౌరవనీయ స్థాయికి చేర్చాయి.తర్వాత బౌలింగ్‌లో భారత బృందం దాడిని మరింత పెంచింది. తొలి ఓవర్లలోనే వేగం, నియంత్రణ, పట్టుదలతో బంతులు ఎగరేసిన భారత పేసర్లు ఆఫ్రికా జట్టును కంగారు పడ్డారు. అర్ధదజన్ లోపే వికెట్లు కూలిపోవడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ దరిదాపుల్లోనే కుప్పకూలిపోయింది. ముఖ్యంగా అర్ధీప్, వరుణ్, బుమ్రా, అక్షర్ తీశిన వికెట్లు మ్యాచ్ పట్టు పూర్తిగా భారత్ వైపు మళ్లించాయి. మరోవైపు దూబే అదనంగా తీసుకున్న వికెట్ ఆఫ్రికా జట్టు ప్రతిఘటనకు చెక్ పెట్టింది.కొన్ని చిన్న భాగస్వామ్యాలు తప్ప దక్షిణాఫ్రికా జట్టు ఎప్పుడూ నిలదొక్కుకోలేదు. 101 పరుగుల భారీ తేడాతో భారత్ సాధించిన విజయం ఈ సిరీస్‌కు బలమైన శ్రీకారం వేసింది. రాబోయే మ్యాచ్‌ల్లో ఈ ఊపును కొనసాగిస్తామని భారత జట్టు ఆశాభావం వ్యక్తం చేసింది

# మరోసారి అగార్కర్‌ను టార్గెట్ చేసిన గంగూలీ..!

**వేద న్యూస్ డెస్క్ :**



టీమిండియా పేసర్ మహ్మద్ షమీని నిరంతరం పక్కన పెట్టడం ఎందుకని తనకే అర్థం కావడం లేదని టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఘాటుగా స్పందించాడు. ముఖ్యంగా సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో వరుసగా వికెట్లు తీసి ఫామ్‌లో ఉన్న షమీని జాతీయ జట్టుకు ఎంపిక చేయకపోవడంపై చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌ను మరోసారి పరోక్షంగా టార్గెట్ చేశాడు.తాజాగా ముగిసిన టోర్నీలో షమీ కేవలం మూడు మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీసి తన పేస్, శైలిని మరోసారి రుజువు చేశాడు. పుదుచ్చేరిపై మూడు వికెట్లు, హైదరాబాద్‌పై నాలుగు వికెట్లు, హర్యానాపై నాలుగు వికెట్లతో ప్రత్యర్థులను బెంబేలెత్తించాడు. అయినా అతనికి జాతీయ జట్టు నుంచి పిలుపు రాకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.గంగూలీ  ఆ తర్వాత చాంపియన్స్ ట్రోఫీలో మంచి ప్రదర్శన ఇచ్చినా మళ్లీ పక్కనపెట్టారు. తాజాగా ఆస్ట్రేలియాతో పరిమిత ఓవర్ల సిరీస్‌కు కూడా ఎంపిక కాలేదు.ఇకబోతే షమీ–అగార్కర్ మధ్య ఏదో భేదాభిప్రాయం ఉన్నట్టుగా క్రికెట్ వర్గాల్లో చర్చలు సాగుతున్నాయి. వరుసగా తాను ఫామ్‌లో ఉన్నప్పటికీ అవకాశాలు దక్కకపోవడం అభిమానుల్లో పెద్ద అసంతృప్తికి దారి తీస్తోంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073